

ESTD : 1999

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా

సోమవారం నవంబర్ 16,2026 పేజీలు 08

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

కందనూలు: సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నెలవారి కేసుల వివరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లావ్యాప్తంగా నమోదైన నేరాలు, దర్యాప్తు పురోగతి, మిస్సింగ్, ఎస్సీ/ ఎస్టీ అట్రాసిటీ, గ్రేవ్, నాన్-- గ్రేవ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ అమలు చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మిస్సింగ్ కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యంతో చేపట్టి, అదృశ్యమైన వారి ఆచూకీ త్వరితగతిన గుర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ/ ఎస్టీ కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావు లేకుండా చట్టపరమైన గడువుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రేవ్, నాన్-- గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలన్నారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ డేటాను తప్పనిసరిగా నవీకరించాలని, మాన్యువల్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు సకాలంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

బహిరంగ సభకు తరలి వెళ్లిన నాయకులు



మగనూరు, నవంబర్ 15 (విజన్ ఆంధ్ర)

మాగనూరు మండలం నుండి నల్లగొండలో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభల మాగనూరు మండలం నుండి రైతు సంఘం నాయకులు బహిరంగ సభకు తరలి వెళ్లారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు, సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్ మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. 1936 ఏప్రిల్ 11న లక్నోలో అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటై 2026 నాటికి 90 ఏండ్లు పూర్తయ్యాయి. అదేవిధంగా 1946 జూలై 4న ప్రారంభమైన చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కూడా 80 ఏండ్లు పూర్తయింది. ఆ చారిత్రక పోరాటానికి ప్రధాన కేంద్రాల్లో ఒకటైన నల్లగొండలో 36వ జాతీయ మహాసభలు నిర్వహించాలని నిర్ణయించడం ఈ మహాసభలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఉంటుందని అన్నారు.

దేశవ్యాప్తంగా సాగుతున్న రైతాంగ పోరాటాలను ఐక్యం చేయడం ద్వారానే అఖిల భారత కిసాన్ సభ ఏర్పడిందన్నారు . ఆవిర్భావం నుంచి ఈ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా అనేక చారిత్రక, విజయవంతమైన రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించింది.

1991లో ప్రారంభమైన ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల ఫలితంగా గత 35 ఏండ్లలో కొత్త, తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యాయి. భారత్‌తోపాటు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలపై అసమానమైన ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలు, పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు, పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం, సంస్థాగత రుణాల సంక్షోభం ఈ కాలంలో తీవ్రమయ్యాయి. సంస్థాగత రుణాల్లో అధిక భాగం శక్తివంతమైన కార్పొరేట్ సంస్థల వైపు మళ్లింది.

అన్ని రంగాల్లో కార్పొరేట్ కంపెనీలు వేగంగా విస్తరించాయి. 2014 తర్వాత మోదీ నాయకత్వంలోని బీజేపీ సర్కార్ రైతులు, కార్మిక వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మరింత తీవ్రమైన సవాళ్లను సృష్టించింది. సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను ప్రోత్సహించింది. తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం తలెత్తింది. ఫలితంగా గత మూడు దశాబ్దాల్లో 4 లక్షలకు పైగా రైతుల ఆత్మహత్యలకు కారణమైంది. వీరిలో లక్ష మందికి పైగా మోదీ నాయకత్వంలోని బీజేపీ పాలనలోనే ఆత్మహత్య చేసుకున్నారు. పేదరికం, నిరుద్యోగం, ఆకలి బాధలు తీవ్రంగా పెరిగాయి. అదే సమయంలో ఆదానీ, అంబానీ వంటి కొద్దిమంది కార్పొరేట్ సంపన్నుల ఆదాయం, సంపద విపరీతంగా పెరిగాయి. 2025 ప్రపంచ ఆకలి సూచికలో 123 దేశాల్లో భారత్ 102వ స్థానంలో నిలిచింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో ఏర్పడ్డ ఎల్ నియో ప్రభావంతో నష్టపోయిన రైతంగాని ఆదుకోవాలని మాట్లాడడం జరిగింది, ఈ కార్యక్రమంలో బ్యాగరీ నర్సింలు ఏం అశోక్ కొత్తపల్లి భూమానందు వడ్డే రాజు శంకరప్ప ఆంజనేయులు నేరేటి నర్సింలు కుమ్మరి మారెప్ప బోల్లబోడి దేవప్ప గుంజూరు తాయప్ప వాకిటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర బ్రేకింగ్ న్యూస్

వాడియాల్ చెక్‌డ్యామ్ వద్ద అక్రమ ఇసుక రవాణా!

పోలీసుల దాడి.. ఇసుక నింపుతున్న ట్రాక్టర్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు

మిడ్జిల్, నవంబర్ 15 (విజన్ ఆంధ్ర):

మిడ్జిల్ మండల పరిధిలోని వాడియాల్ గ్రామం పోచమ్మ పంపు సమీపంలోని చెక్‌డ్యామ్ వద్ద మళ్లీ అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం ట్రాక్టర్ ద్వారా చెక్‌డ్యామ్ వద్ద ఇసుక నింపుతున్న క్రమంలో పోలీసులకు సమాచారం అందింది.వెంటనే స్పందించిన మిడ్జిల్ ఎస్ఐ పోలీసు సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇసుక నింపుతున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చెక్‌డ్యామ్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణా మళ్లీ కొనసాగుతుండటంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ నీటి వనరులకు నష్టం కలగకుండా సంబంధిత అధికారులు నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



విజన్ ఆంధ్ర । మిడ్జిల్ మండలం

మల్లాపూర్‌లో అక్రమ మట్టి తరలింపుపై గ్రామస్తుల మెరుపుదాడి!

మూడు టిప్పర్లు, ఒక జేసీబీ పట్టివేత.. పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు!

మిడ్జిల్ విజన్ ఆంధ్ర నవంబర్ 15

మిడ్జిల్: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం మల్లాపూర్ గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలతో గ్రామస్తులు, రైతులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన వాహనాలు!

ప్రస్తుతం మూడు టిప్పర్లు, ఒక జేసీబీ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే వాహనాలను నామమాత్రపు జరిమానాలతో విడిచిపెట్టాలంటూ కొందరు నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

అధికారుల చర్యలపై గ్రామస్తుల ఎదురుచూపు!

ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే అక్రమ మట్టి తరలింపుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై మల్లాపూర్ గ్రామస్తులు, రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



ప్రజల ప్రశ్నలు ఇవే..

-అక్రమ మట్టి తరలింపుపై కేసులు నమోదు చేస్తారా?

-పట్టుబడిన వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా?

-రాజకీయ ఒత్తిళ్ల ఆరోపణలపై అధికారులు స్పందిస్తారా?

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అక్రమ మట్టి తరలింపుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంగూరు కృష్ణారెడ్డి సంకల్పం.. వేలాది మందికి విద్యాబాట..!

-వీపనగండ్ల విద్యా ప్రస్థానంలో ఎయిడెడ్ హైస్కూల్ ఓ చారిత్రక మైలురాయి

-ఉన్నత విద్యకు దూరమైన గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో అక్షరజ్యోతులు వెలిగించిన వంగూరు కృష్ణారెడ్డి

-స్వాతంత్ర్య సమరయోధుడి సంకల్పంతో 1960లో విద్యావ్యాప్తికి శ్రీకారం.. పేద విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి.. వేలాది మందికి ఉన్నత విద్యాబాట

-గ్రామస్తుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావంతో సాగిన విద్యా ప్రస్థనం.. 2004లో జిల్లా పరిషత్‌లో విలీనం

-వీపనగండ్ల ప్రాంత అక్షరాస్యత, సామాజిక చైతన్యం, అభివృద్ధికి పునాది వేసిన విద్యాసంస్థను మరింత అభివృద్ధి చేయాలి : డి. కృష్ణయ్య

వీపనగండ్ల, నవంబర్ 15 విజన్ ఆంధ్ర

ఒకప్పుడు ఉన్నత విద్యకు దూరంగా ఉన్న గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో అక్షరజ్యోతులు వెలిగించి, వేలాది మందికి విద్యాబాటలు వేసిన వీపనగండ్ల ఎయిడెడ్ హైస్కూల్ ప్రాంత విద్యా చరిత్రలో చెరగని ముద్ర వేసిందని టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి డి. కృష్ణయ్య తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కీ.శే. వంగూరు కృష్ణారెడ్డి విద్యావ్యాప్తిపై చూపిన అంకితభావం, దూరదృష్టి వల్లే ఈ ప్రాంతంలో విద్యా సుగంధాలు వ్యాపించాయని పేర్కొన్నారు. గత చరిత్రను నెమరువేసుకుంటూ, విద్యాసంస్థ ప్రస్థానాన్ని వివరిస్తూ ఆయన ప్రత్యేక కథనాన్ని వెల్లడించారు.

విద్యకు దూరమైన గ్రామీణ విద్యార్థులకు అక్షరజ్యోతి

దశాబ్దాల క్రితం వీపనగండ్ల పరిసర గ్రామాల్లో ఉన్నత విద్యా అవకాశాలు లేక విద్యార్థులు కొల్లాపూర్, మహబూబ్‌నగర్, వనపర్తి ప్రాంతాలకు వెళ్లి హాస్టళ్లలో ఉంటూ చదువుకోవాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. అప్పటి ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాల కల్పనపై తగిన దృష్టి సారించలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను మార్చాలనే సంకల్పంతో వంగూరు కృష్ణారెడ్డి 1960–61లో ఎయిడెడ్ హైస్కూల్‌ను ప్రారంభించి విద్యావ్యాప్తికి బలమైన పునాది వేశారని వివరించారు.తన సొంత ఖర్చులతో పాటు సహచరులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలను ఏర్పాటు చేశారని, బియ్యం, పప్పు, నగదు విరాళాలు సేకరించి 5వ తరగతి నుంచి హైస్కూల్ వరకు విద్యను అందించారని తెలిపారు. రెండు ఎకరాల స్థలాన్ని సేకరించి ఐదు గదులను నిర్మించడంతో పాటు ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధనకు అవసరమైన సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి

విద్య పేదలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో 25 మంది విద్యార్థులతో హాస్టల్ ప్రారంభించి ఉచిత భోజనం, వసతి కల్పించడం అప్పట్లో ఎంతో గొప్ప విషయమని కృష్ణయ్య తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో అనంతరం సహకార జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారని, అది 1986లో




ప్రభుత్వ జూనియర్ కళాశాలగా ఏర్పడిందని వివరించారు. 1968లో హయ్యర్ సెకండరీ గ్రేడ్‌గా 25 మంది విద్యార్థులతో ప్రారంభమైన విద్యాసంస్థ కాలక్రమంలో 250 మందికి పైగా విద్యార్థులతో విరాజిల్లిందన్నారు.

చాలీచాలని వేతనాలతోనూ విద్యాబోధన

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. నెలకు కేవలం రూ.70 నుంచి రూ.100 వరకు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ విద్యార్థులకు విద్యను అందించిన ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమన్నారు. కరస్పాండెంట్‌గా వంగూరు కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులుగా వెంగళప్ప, వంగూరు విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు సేవలందించారని తెలిపారు. ఉపాధ్యాయులుగా ఎం. నారాయణ, లక్ష్మారెడ్డి, బసవయ్య, వెంకటరెడ్డి, దామోదరాచారి, పీఈటీగా శేఖర్ రెడ్డి తదితరులు పనిచేశారని వివరించారు. నాన్ టీచింగ్ సిబ్బంది కూడా పాఠశాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

జిల్లా పరిషత్‌లో విలీనానికి విశేష కృషి

2000 జూలైలో కరస్పాండెంట్ వంగూరు కృష్ణారెడ్డి మరణించిన అనంతరం పాఠశాల నిర్వహణలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. అప్పటి డిప్యూటీ డీఈవో ఉషారాణి, ఆర్. పాపల్‌రావు స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహరించారని పేర్కొన్నారు. అనంతరం సోషల్ అసిస్టెంట్‌గా పనిచేసిన బి. లక్ష్మారెడ్డి ముందుండి ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతున్న యుటిఎఫ్ సహకారంతో పాటు గ్రామస్తుల మద్దతు తీసుకుని పాఠశాలను జిల్లా పరిషత్‌లో విలీనం చేసేందుకు కృషి చేశారని తెలిపారు.అప్పటి శాసనసభ్యుడు కే.



మధుసూదన్‌రావు, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు కృషితో 2004లో పాఠశాల జిల్లా పరిషత్‌లో విలీనమైందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులుగా ఎం. నారాయణ, అనంతరం బి. లక్ష్మారెడ్డి, ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారని, అప్పటి నుంచి పాఠశాల దినదినాభివృద్ధి చెందిందన్నారు.

వేలాది మందికి విద్య.. సామాజిక చైతన్యానికి పునాది

ఎయిడెడ్ హైస్కూల్ ద్వారా వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో స్థిరపడ్డారని కృష్ణయ్య తెలిపారు. ప్రజా సంఘాల నాయకులుగా, రచయితలుగా, కవులుగా, కళాకారులుగా, వివిధ వృత్తుల్లో ప్రముఖులుగా ఎదిగిన ఎంతోమందికి ఈ పాఠశాల విద్యాబాటలు వేసిందని పేర్కొన్నారు. వీపనగండ్ల ప్రాంత అక్షరాస్యత, సామాజిక చైతన్యం, అభివృద్ధి, పేరు ప్రతిష్ఠలకు ఈ విద్యాసంస్థ ప్రధాన భూమిక పోషించిందని తెలిపారు.

చారిత్రక విద్యాసంస్థ అభివృద్ధికి అందరి సహకారం అవసరం

విద్య అందుబాటులో ఉన్న చోటే అభివృద్ధి, నైతిక విలువలు, ఉపాధి అవకాశాలు, సామాజిక చైతన్యం విస్తరిస్తాయని పేర్కొన్నారు. వీపనగండ్ల ప్రాంత విద్యా ప్రస్థానంలో కీలక పాత్ర పోషించిన ఈ పాఠశాలను మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఉందన్నారు. ప్రభుత్వం చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఇలాంటి విద్యాసంస్థలను మరింత ఉన్నతీకరించి, ఆధునిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధికి బాటలు వేయాలని డి. కృష్ణయ్య కోరారు.

పులిమామిడిలో వైభవంగా శ్రీ చౌడేశ్వరి మాత 9వ వార్షికోత్సవం

నారాయణపేట, ఉట్కూర్, నవంబర్ 15 (విజన్ ఆంధ్ర)



ఊట్కూర్ మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో కొలువుదీరిన శ్రీ చౌడేశ్వరి మాత దేవాలయంలో 9వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవాంగ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా కుంభోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు, దేవాంగ సమాజ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.వార్షికోత్సవ వేడుకలు భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో దేవాంగ సమాజ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లకే కరాటేలో అంతర్జాతీయ స్వర్ణ పతకం.. కళ్యాణి ప్రతిభ

చిన్న వయసులోనే సత్తాచాటిన జాజాపూర్ చిన్నారి ప్రతిక్ష.

నారాయణపేట, నవంబర్ 15 (విజన్ ఆంధ్ర)





ఏడేళ్ల చిన్న వయసులోనే అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించి జాజాపూర్ గ్రామానికి చెందిన చిన్నారి కాత్రే ప్రతిక్ష అందరి ప్రశంసలు అందుకుంటోంది. నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామానికి చెందిన కాత్రే శివశంకర్, కళ్యాణి దంపతుల కుమార్తె ప్రతిక్ష హైదరాబాద్‌లో రెండో తరగతి చదువుతోంది. ఆదివారం హైదరాబాద్ బాల పురస్కార్ ఆధ్వర్యంలో కళాక్షేత్ర ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన 2026 అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొన్న ప్రతిక్ష అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఏడేళ్ల వయసులోనే కోచర్ శరత్ కుమార్ నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ప్రతిభను పలువురు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

పార్టీ మారని నిబద్ధత గల సీనియర్ నాయకుడు సంజీవ్ ముదిరాజ్ కు బీసీ కోటా కింద గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి.

ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు బొక్కల శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్.

వెల్దండ, నవంబర్ 15 (విజన్ ఆంధ్ర).

కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో సేవలందిస్తున్న సీనియర్ నాయకుడు మహబూబ్నగర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ కు బీసీ కోటా కింద గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకుడు బొక్కల శ్రీనివాస్ ముదిరాజ్ ఆదివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా బొక్కల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ...



పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా పార్టీని వీడకుండా, పార్టీ మారని నిబద్ధత కలిగిన సీనియర్ నాయకుడు సంజీవ్ ముదిరాజ్ ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, బీసీల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి, ఇలాంటి సీనియర్ నాయకుడి సేవలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించాలని ఆయన అన్నారు,

బీసీ కోటా కింద గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించి సముచిత గుర్తింపు ఇవ్వాలని ముదిరాజ్ బిడ్డగా, కాంగ్రెస్ కార్యకర్తగా కోరుతున్నానని తెలిపారు.

పార్టీ మారని నాయకుడికి పదవి ఇస్తే పార్టీకి విధేయతగా పనిచేసే కార్యకర్తలకు భరోసా ఇచ్చినట్లు అవుతుందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో సంజీవ్ ముదిరాజ్ కు సముచిత గౌరవం దక్కేలా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని ఆయన కోరారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లో ముదిరాజులే ఎక్కువ జనాభా కలిగి ఉన్నారని అన్ని నియోజక వర్గాల్లో ఒక పార్టీ గెలుపు ఓటముల నిర్ణయాలు వారి చేతుల్లోనే ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

ముల్కనూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాల అందజేసిన సర్పంచ్ దంపతులు

చిగురుమామిడి : నవంబర్15 (విజన్ ఆంధ్ర)



చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్ గ్రామ సర్పంచ్ సాంబారీ భారతమ్మ కొమురయ్య కుమారుని వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలు అందించి, ఆత్మీయంగా వివాహానికి ఆహ్వానించారు.

గ్రామ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తూ, గ్రామ ప్రజలకు నిరంతరం సేవలందించే పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వారిని గౌరవించడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సిబ్బందిని కేవలం ఉద్యోగులుగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావించి, వారి సేవలకు గుర్తింపునిస్తూ నూతన వస్త్రాలు అందించడం సర్పంచ్ దంపతుల ఆత్మీయతకు, మానవీయ విలువలకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సిబ్బందికి గౌరవం ఇవ్వడం అంటే వారి సేవలకు గుర్తింపు ఇవ్వడమే. ఇలాంటి పరస్పర గౌరవం, ఆత్మీయత గ్రామంలో ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షిస్తూ సర్పంచ్ దంపతులకు పలువురు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

జూపల్లి చెన్నకేశవ స్వామి ఆలయానికి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి చేయూత..రూ.20 వేల విరాళం..

చారకొండ,నవంబర్ 15 (విజన్ ఆంధ్ర

చారకొండ మండలం జూపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 19న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన,ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ.20 వేల ఆర్థిక విరాళం అందజేశారు.

వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ



అధ్యక్షుడు,మాజీ ఎంపీపీ పుట్ట రామ్ రెడ్డి ద్వారా గ్రామ నాయకుడు బొజ్జయ్యకు ఈ విరాళం మొత్తాన్ని అందించారు.ఆలయంలో జరగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు తన వంతు సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్,యువ నాయకులు అంజి మాస్టర్,పోలె అశోక్,రాజు తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లను సద్వినియోగం చేసుకోండి

-మేనేజర్ ఎల్. గాంధీ నాయక్, సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు

రామగిరి నవంబర్ 15(విజన్ ఆంధ్ర)



కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీ)లో అందుబాటులో ఉన్న డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎల్. గాంధీ నాయక్, సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు సూచించారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై కళాకారులచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై లభిస్తున్న వడ్డీ రేట్లపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు ద్వారా గరిష్ఠంగా 8 శాతం వడ్డీ అందిస్తున్నట్లు గాంధీ నాయక్ తెలిపారు. అదే విధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకులో లాకర్ సౌకర్యంతో పాటు బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.9,000 వరకు రుణం, గృహ నిర్మాణ రుణాలు, గృహ కొనుగోలు రుణాలు, విద్యా రుణాలు, వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర రుణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఖాతాదారులు ఫోన్‌పే, గూగుల్‌పేతో పాటు కేడీసీసీ బ్యాంక్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు పని వేళల్లో 9121014904 నంబర్‌కు ఫోన్ చేస్తే బ్యాంకింగ్ సేవలు, రుణాలు, డిపాజిట్లకు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తామని తెలిపారు.

వివాహ వేడుకలల్లో హాజరైన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్.

వెల్దండ, నవంబర్ (విజన్ ఆంధ్ర).

వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన కొమ్మగోని బాలరాజు గౌడ్ కుమారుడు గణేష్ వివాహ వేడుకలు కేఎల్ఆర్ గార్డెన్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకకు వెల్దండ స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు



తెలిపారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర శ్రీనివాస్ గౌడ్, నాయకులు మట్ట విష్ణు, ఎండి రషీద్, సింగిల్ విండో డైరెక్టర్ కొయ్యల పుల్లయ్య, కొండల్, వెంకటేష్, రేవల్లి రాజు, ఈదులపల్లి శ్రీనివాస్, నాగరాజు, తిరుపతి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

9

వివాహ వేడుకకు హాజరైన ఐజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్

అయిజ : విజన్ ఆంధ్ర పత్రిక నవంబర్ 15

జోగులమ్మ గద్వాల జిల్లా లో కాంల్లే వారి ఆహ్వానం మేరకు ాఎ ఫంక్షన్ హాల్ నందు జరిగిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కాంల్లే రామలింగేశ్వర గారి కుమార్తె నేహా వెడ్స్ కృష్ణ వివాహ వేడుకకు



గౌరవ ఐజ మున్సిపల్ చైర్మన్ శ్రీ సీఎం సురేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం ఆనందంగా విరాజిల్లలి అని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు...

ఈ శుభకార్యక్రమంలో సీఎం సురేష్ గారి మిత్రబృందం పాల్గొని వధూవరులకు శు భాకాంక్షలు తెలియజేశారు...

సీఈఐఆర్‌తో పోయిన ఐఫోన్ తిరిగి స్వాధీనం..బాధితుడికి అందజేసిన చారకొండ పోలీసులు

చారకొండ,నవంబర్ 15(విజన్ ఆంధ్ర)

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి పోలీసులు బాధితుడికి తిరిగి అందజేశారు. చారకొండ మండలం శాంతిగూడెం గ్రామానికి చెందిన తన్నీరు వెంకటేశ్ తన యాపిల్ ఐఫోన్‌ను పోగొట్టుకున్నారు. దీంతో ఆయన సీఈఐఆర్



పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయగా, సైబర్ క్రైమ్ వారియర్ ఆంజనేయులు సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను ట్రేస్ చేసి రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలంగౌడ్ రికవరీ చేసిన ఐఫోన్‌ను బాధితుడు తన్నీరు వెంకటేశ్‌కు అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి అందించిన పోలీసులకు వెంకటేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.